
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం । 4 । జనవరి । 2025
I



సోమశిలలో 71.813 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 71.813 టీఎంసీలు ఉన్నాయి. 3238 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, డెల్టాకు 1550, ఉత్తరకాలువకు 600, కండలేరుకు 800, దక్షిణకాలువకు 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.79,740
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,239
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,456
నవర (8 గ్రాములు)	రూ.59,648

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.7 /22.8

జిల్లాలో శనివారం వాతావరణం పొడిగా ఉంటుంది. అక్కడక్కడ ఆకాశం మేఘావృతంగా ఉండనుంది. శుక్రవారం గాలిలో తేమ 67 శాతంగా ఉంది.

న్యూస్‌రీల్

గత డీఎంహెచ్‌ఓకు కడప సీఎస్ ఆర్‌ఎంఓగా పోస్టు

- కోర్టును ఆశ్రయించడంతో వెనక్కి తగ్గిన ప్రభుత్వం



నెల్లూరు (అర్బన్): నెల్లూరు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిగా (డీఎంహెచ్‌ఓ) పని చేసిన డాక్టర్ పెంచలయ్య బదిలీ వ్యవహారం కొలిక్కి వచ్చింది. ఇటీవల ఆయన్ను ప్రభుత్వం డిమోట్ చేసి రంపచోడవరం అడిషనల్ డీఎంహెచ్‌ఓగా బదిలీ చేసింది. డాక్టర్ పెంచలయ్యను మాజీమంత్రి అనిల్ కుమార్‌యాదవ్ మనిషిగా ముద్ర వేశారు. ఈ నేపథ్యంలో టీడీపీ నేతలు ఆయన స్థాయిని తగ్గించి సుదూరంలోని మన్యం ప్రాంతానికి బదిలీ చేయించారనే ప్రచారం జోరందుకుంది. ఈ క్రమంలో డాక్టర్ పెంచలయ్య తాను రాష్ట్రంలోనే సీనియర్‌నని, తక్కువ క్యాడర్ ఉన్న వారికి ప్రమోషన్ ఇచ్చి డీఎంహెచ్‌ఓగా నియమించి తనకు అన్యాయం చేశారంటూ ఆయన కోర్టుకు వెళ్లారు. దీంతో కోర్టు మొట్టికాయలు వేయక ముందే ప్రభుత్వం మేల్కొంది. ఆగమేఘాలపై రంపచోడవరం అడిషనల్ డీఎంహెచ్‌గా బదిలీ చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకుంది. కడపలో ఉన్న 300 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సీఎస్ ఆర్‌ఎంఓగా నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ పద్మావతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

వీఎస్‌యూలో జాబ్ మేళా



జాబ్‌మేళాకు హాజరైన విద్యార్థులు

వెంకటాచలం: మండలంలోని కాకుటూరులో ఉన్న విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ)లో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. 47 మంది అభ్యర్థులు హాజరుకాగా, వివిధ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేసి 18 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. ఉద్యోగాలు పొందిన వారిని వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు అభినందించారు.

ఉద్యోగాలకు 11 మంది ఎంపిక

ఉదయగిరి: స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 11 మంది నిరుద్యోగులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు నియామక పత్రాలు పొందినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ నారాయణస్వామి తెలిపారు. 34 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరు కాగా 11 మందిని గ్రీన్‌టెక్, ఎయిల్‌టెల్ పేమెంట్ బ్యాంకు కంపెనీలు ఉద్యోగాలకు ఎంపిక చేశాయన్నారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారి అబ్దుల్‌ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్టులో రెండు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతోందని ప్రాజెక్ట్ ఇంజినీర్లు శుక్రవారం తెలిపారు. 1వ యూనిట్లో 540, 3వ యూనిట్లో 560 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. ఓవర్ ఆయిలింగ్ కారణంగా 2వ యూనిట్లో ఉత్పత్తి నిలిపివేసినట్లు వెల్లడించారు.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి టీడీపీ కార్యకర్తలతో పనులు చేయిస్తున్నారు. ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు కూలీలు లేకుండానే పనులు చేస్తున్నట్లు మార్ఫింగ్ ఫొటోలు అప్‌లోడ్ చేస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. దీంతో పేదలకు పనులు లేకుండా పోతున్నాయి. అక్రమాలకు పాల్పడిన సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినా సిబ్బంది తీరు మారలేదు. అనధికారికంగా నియమించుకున్న సిబ్బంది బోగస్ జాబ్ కార్డులు సృష్టించి, మస్తర్లు వేసి నిధులు స్వాహా చేస్తున్నారు.

సెల్‌ఫోన్‌లో ఫొటో తీసి, మార్ఫింగ్ చేసి అప్‌లోడ్ చేసిన దృశ్యం





ఫీల్డ్ అసిస్టెంట్లు లేకుండానే పనులు

- టీడీపీ కార్యకర్తలతో విధులు
- కేసులు పెట్టినా మారని సిబ్బంది తీరు
- అవినీతిమయంగా ఉపాధి పనులు

బినామీ కూలీలు బోగస్ మస్తర్లు

నెల్లూరు (పొగతోట): కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఆ పార్టీ నేతలు వచ్చాక ఉపాధి పథకాన్ని అడ్డం పెట్టుకుని అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. గతంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు తొలగించిన టీడీపీకి అనుకూలంగా ఉన్న కార్యకర్తలతో పనులు చేయిస్తున్న పరిస్థితి నెలకొంది. వీరు బోగస్ జాబ్‌కార్డులు సృష్టించి, బోగస్ మస్తర్లు వేస్తూ పనులు చేయకుండానే నిధులు కాజేస్తున్నారు. పనులు చేస్తున్నట్లు, చేసినట్లు మార్ఫింగ్ ఫొటోలు అప్‌లోడ్ చేస్తున్నారు. ఉపాధి కూలీలకు పనులు కల్పించకపోవడంతో బతుకుదెరువు లేక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో దాదాపు 4 లక్షలకు పైగా జాబ్‌కార్డులు కలిగిన కూలీలు ఉన్నారు. వీరందరికి పనులు కల్పించాల్సి ఉంది. ప్రతి నిత్యం ఆయా పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలకు పనులు కల్పించి పని చేస్తున్న ప్రదేశం నుంచి ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. అయితే సుమారు 400 పైగా పంచాయతీల్లో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారు. అనధికారికంగా టీడీపీ కార్యకర్తలతో పనులు పర్యవేక్షిస్తున్నారు.

ఎస్టీ గ్రూపుల్లో ఓసీలు..

కలువాయి మండలంలో టీడీపీ కన్వీనర్ తమ్ముడు కను సన్నల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. ఎస్టీ గ్రూపుల్లో ఓసీలను చేర్చి బినామీ పేర్లతో పనులు నిర్వహిస్తూ నిధులు స్వాహా చేస్తున్నారు. ఒక్క కలువాయి మండలంలోనే 147 ఓసీ కార్డులను సృష్టించారు. బ్యాంకు అకౌంట్లను జత చేసి పనులు చేయకుండానే నిధులు దిగమింగుతున్నారు. వాస్తవానికి పని ప్రదేశంలో కూలీలకు రోజు వారీగా చేసిన పనులకు సంబంధించి కొలతలు, ఫీల్డ్ అసిస్టెంటు, టెక్నికల్ అసిస్టెంట్లు కొలతలు వేయాల్సి ఉంది. రోజు వారి వేతనం గిట్టుబాటు అయ్యేలా కూలీలకు పనులు కల్పించాల్సి ఉంది. ఇవేమి పట్టకుండా కూలీలు లేకుండానే పనులు చేస్తున్నట్లు దొంగ మస్తర్లు సృష్టిస్తున్నారు. ఒక ప్రాంతంలో చేసిన పని ఫొటోను సెల్‌ఫోన్‌తో అనేక వైపుల నుంచి ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తున్నారు. ఇటువంటి తతంగం కలువాయి మండలం కలువాయి, రాపూరు, ఉదయగిరి, ఎస్ఆర్‌పురం, మర్రిపాడు తదితర మండలాల్లో అధికంగా జరుగుతున్నాయి. ఇప్పటికే కలువాయి మండలంలో రూ.63 లక్షలకు పైగా అక్రమాలు జరిగాయని నిగ్గు తేల్చారు. ఆరుగురు సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. టీడీపీ గతంలోనూ ఉపాధి హామీ పనుల్లో భారీ స్థాయిలో అక్రమాలు చోటు చేసుకున్నాయి.

అక్రమాలకు ఆధారాలివిగో..

కలువాయి మండలంలో జరిగే పనుల్లో వర్క్ ఐడీ నంబర్లు 0209022005 1, 9999005185983లకు సంబంధించి 14459, 14460, 1462, 1463, 1464, 1465, 1466, 1467, 1482, 1483, 14538, 14539 తదితర మస్తర్లు ఒకే ఫొటోను అప్‌లోడ్ చేశారు. రోజుకు 70 నుంచి 80 మంది కూలీలు పనులకు హాజరవుతున్నట్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి నిధులు స్వాహా చేశారు. ఆ మండలంలోని 20 పంచాయతీల్లో ఒకే ఫొటోతో అన్ని పనులకు సంబంధించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కనుపూరుపల్లి పంచాయతీలో వర్క్ ఐడీ నంబర్లు 0209022017, 1918510206670 ఫీడర్ కాలువ పనులు వంద మందితో చేస్తున్నట్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి ఫొటోకు చేయి అడ్డం పెట్టి అప్‌లోడ్ చేశారు. ఈ విధంగా అక్రమాలకు పాల్పడుతూ పేదలకు చెందాల్సిన ఉపాధి నిధులను స్వాహా చేస్తున్నారు. కలువాయి మండలంలో అక్రమాలకు పాల్పడిన సిబ్బందిపై కేసులు నమోదు చేసినా ఇతర సిబ్బంది పనితీరులో మార్పు రాలేదు. టీడీపీ నాయకుల ప్రోత్సాహంతో అవినీతి అక్రమాలతో చెలరేగిపోతున్నారు. గతంలో అక్రమాలకు పాల్పడి తొలగించిన సిబ్బంది మళ్లీ పోస్టింగ్ తెచ్చుకుని అవినీతి అక్రమాలకు తెరలేపుతున్నారు. కూటమి ప్రభుత్వం అండదండలతో కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఉపాధి హామీ పథకం అమల్లో అవినీతి అక్రమాలకు పాల్పడే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటాం. కలువాయి మండలానికి సంబంధించి ఆరుగురు సిబ్బందిపై కేసులు నమోదు చేశాం. కూలీలు లేకుండా బినామీ మస్టర్లు వేస్తూ చేతులు అడ్డుపెట్టి ఫొటోలు అప్‌లోడ్ చేసే సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. సిబ్బంది నిబంధనలు పాటిస్తూ జాబ్ కార్డులు కలిగిన పేద కూలీలకు పనులు కల్పించాలి.

– గంగాభవానీ, డ్వామా పీడీ

అశక్తుల పింఛన్‌పై కూటమి కుట్ర

- జిల్లాలో 1,274 మంది లబ్ధిదారుల్లో ఏరివేతే లక్ష్యం
- ఈ నెల 6వ తేదీ నుంచి వెరిఫికేషన్‌కు ప్రత్యేక బృందాల ఏర్పాటు

కావలి: అనారోగ్యం, పక్షవాతం, తీవ్ర కండరాల లోపం, ప్రమాదానికి గురైన తదితర కారణాలతో మంచానికి, వీల్ చైర్‌కే పరిమితమైన వారికి గత ప్రభుత్వం ఉదారంగా నెలకు రూ.10 వేలు వంతున వైఎస్సార్ సామాజిక పింఛన్ కానుకను అందజేసింది. ఎన్నికల సమయంలో ఇటువంటి వారికి నెలకు రూ.15 వేలు ఇస్తామంటూ కూటమి నేతలు ప్రచారం చేశారు. ఆరు నెలలు ఇచ్చారో లేదో.. అప్పుడే ఈ తరహా పింఛన్ లబ్ధిదారుల్లో కోత విధించడానికి కూటమి ప్రభుత్వం సిద్ధపడింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు తాజాగా ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో మంచానికి, వీల్ చైర్‌కే పరిమితమైన పేదలైన ఇటువంటి విధి వంచిత అశక్తులకు 1,274 మంది గత ప్రభుత్వం హయాంలో ఇంటి వద్దనే వైఎస్సార్ సామాజిక పింఛన్ కానుకను అందుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎన్టీఆర్ భరోసా పేరుతో జూలై నుంచి రూ.15,000 చొప్పున పింఛన్లు పంపిణీ చేస్తోంది. ప్రభుత్వం నెలకు రూ.1,91,10,000 అందజేస్తోంది. ఇటువంటి లబ్ధిదారుల సంఖ్యను గణనీయంగా తగ్గించాలనే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రత్యేక బృందాలతో ప్రతి లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి పరిశీలించాలని నిర్ణయించింది. అందులో భాగంగా కలెక్టర్ డీఆర్‌డీఏ పీడీ, డీఎంహెచ్‌ఓలతో చర్చించి ప్రత్యేక బృందాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీ, సీహెచ్‌సీ వైద్యులు, గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు, గ్రామ స్థాయి అధికారులతో కూడిన ప్రత్యేక బృందాలు ఈ నెల 6వ తేదీ నుంచి లబ్ధిదారుల నివాసాలకు వెళ్లాలని ఆదేశించారు. వారి ఆరోగ్య పరిస్థితి, ఆర్థిక స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక అందజేయనున్నారు. లబ్ధిదారులు ఉన్న చోటు నుంచే లొకేషన్‌తో సహా వివరాలన్నీ కూడా యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. ఆ తర్వాత వారు పింఛన్‌కు అర్హత ఉన్నారా? లేదా అనేది తెలియజేస్తారని సమాచారం. పింఛన్ మంజూరైనప్పుడు దరఖాస్తుతో పాటు పొందుపరిచిన వివరాల్లో ఉన్న ఇళ్లకు వచ్చిన ప్రత్యేక బృందాలకు భౌతికంగా లబ్ధిదారుడు కనిపించాలి. ఆరోగ్య పరిస్థితి కొంత మెరుగైనా, ఈ పింఛన్ కోత విధించనున్నారు.

కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర అసహనం

- సంక్షేమ పథకాలు అందడం లేదని ఆవేదన
- ప్రభుత్వ శాఖల ద్వారా ఏ పనులు కావడం లేదు
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



కాకాణిని కలిసి పూలమొక్కను అందజేస్తున్న ఆనం విజయకుమార్‌రెడ్డి తదితరులు

నెల్లూరు (బారకాసు): కూటమి ప్రభుత్వం వచ్చి దాదాపు ఏడు నెలల గడుస్తున్నా.. ఏ శాఖ ద్వారా ప్రజలకు పనులు సక్రమంగా జరగడం లేదని, ముఖ్యంగా రెవెన్యూ శాఖలో లెక్కకు మించిన సమస్యలు పేరుకుపోయాయని ప్రజలంతా తీవ్ర అసహనంతో ఉన్నారని కేబినెట్ సమావేశంలో స్వయంగా సీఎం చంద్రబాబు చెప్పడమే ఇందుకు నిదర్శనమని మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ శ్రేణులు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పార్టీ జిల్లా కార్యాలయానికి విచ్చేసి కాకాణిని కలిసి పూలమొక్కలు, పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలు కప్పి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ కొత్త సంవత్సర ప్రారంభంలోనే చంద్రబాబు మాట్లాడుతున్న మోసపు మాటలని ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరిస్తామంటూ ఎన్నికల్లో ప్రచారాలు చేసి, అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడు నెలలు గడిచింది. ఇంకో 7 నెలల తర్వాత కొన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడానికి విధివిధానాలను పరిశీలిస్తామనడం సిగ్గు చేటన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే ప్రజల సంక్షేమాన్ని ఆలోచించి ఎన్నికలకు ముందు ప్రకటించిన సంక్షేమ కార్యక్రమాలను సంపూర్ణంగా, సమర్థవంతంగా అమలు చేశారని గుర్తు చేశారు. వైఎస్ జగన్ ప్రజలకు అండగా నిలిచిన విధానాన్ని, చంద్రబాబు మోసగిస్తున్న వైనాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. ఎప్పుడు అవకాశం వస్తుందా? చంద్రబాబుకు బుద్ధి చెప్పడానికి ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. జమిలి ఎన్నికలు 2027లోనే రానున్న నేపథ్యంలో ప్రజలందరూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని తిరిగి కోరుకుంటున్న పరిస్థితుల్లో కందుకూరుతో సహా 11 నియోజకవర్గాలతో పాటు, నెల్లూరు, తిరుపతి పార్లమెంట్ స్థానాల్లో తిరుగులేని మెజార్టీతో విజయబావుటా ఎగురవేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలని కాకాణి పిలుపునిచ్చారు. తనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన వారందరికి పేరు పేరున ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాకాణిని కలిసిని వారిలో పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డితో పాటు పలు ప్రాంతాలకు చెందిన పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో పలువురి నియామకం



నెల్లూరు (బారకాసు): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా కమిటీలో పలువురిని నియమిస్తూ కేంద్ర పార్టీ కేంద్రాలయం శుక్రవారం రాత్రి జాబితా విడుదల చేసింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాతో పాటు కందుకూరు నియోజకవర్గంతో కలిపి 11 నియోజకవర్గాల్లో పార్టీకి విస్తృతంగా సేవలదించిన వారిని గుర్తించి, వారిని పార్టీ కమిటీలో వివిధ హోదాల్లో నియమించింది.

జిల్లా వైస్ ప్రెసిడెంట్లు

మందల వెంకటశేషయ్య, పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి, పల్లాల కొండారెడ్డి, బిల్లా రమణయ్య, డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, మజ్జిగ జయకృష్ణారెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, సర్వజ్ఞ యాచేంద్ర, మెట్టా రాధాకృష్ణారెడ్డి.

జనరల్ సెక్రటరీలు

దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, వేలూరు మహేష్, నీలం సాయికుమార్, లేబూరు పరమేశ్వరరెడ్డి, తోకల కొండయ్య, గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, వేలూరు తిరుపతినాయుడు, పాపకన్ను మధుసూదన్‌రెడ్డి

ట్రెజరర్: గునపాటి సురేష్‌రెడ్డి.

సెక్రటరీ ఆర్గనైజేషనర్లు

గణపం రమేష్, చింతబోయిన దుర్గయ్య, షేక్ సత్తార్, బోయళ్ల ఆదిరెడ్డి, కొండూరు వెంకటసుబ్బరాజు, కామిరెడ్డి రాజారెడ్డి, గంధం ప్రసన్నాంజనేయులు, పోలేపల్లి అనిల్‌కుమార్‌రెడ్డి, కామిరెడ్డి కస్తూరిరెడ్డి, ఉప్పాల ప్రసాద్‌గౌడ్, పిచ్చిపాటి తిరుపతిరెడ్డి, పరిటాల వీరస్వామి, పులిమి రమేష్‌రెడ్డి, వల్లభనేని రాజేంద్రనాయుడు, మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, మొలబంటి శేఖర్‌బాబు, గొల్లపల్లి విజయ్‌కుమార్, షేక్ అల్లాభక్షు, దందోలు లక్ష్మీనారాయణరెడ్డి, గుంటమడుగు శ్రీనివాసరాజు, మున్వర్, మొగలపల్లి కామాక్షిదేవి.

సెక్రటరీ యాక్టివిటీలు

కల్లూరి వెంకటేశ్వరరెడ్డి, రావి ప్రసాద్‌నాయుడు, బద్దెపూడి వెంకటరావు, చండి సురేష్‌యాదవ్, జెట్టి వేణు, ఆర్‌కే సుందర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వాయిల కృష్ణమూర్తి, దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, పేట రాజీవ్ రామిరెడ్డి, వజ్జా అనిల్‌కుమార్‌రెడ్డి, చీమల రాజ, పాశం కొండయ్య, బి.జనార్దన్‌రెడ్డి, చిట్టం శ్రీనివాసులు, మన్నెం చిరంజీవిగౌడ్, వేమారెడ్డి రఘునందనరెడ్డి, నలుబోలు సుబ్బారెడ్డి, గాలి జ్యోతి, కొండూరు వెంకటరత్నంరాజు, కంభం విజయభాస్కర్‌రెడ్డి, పెట్లూరు జగన్‌మోహన్‌రెడ్డి, గుంజి జయలక్ష్మి, ఎస్‌కే జాహిద్.

అధికార ప్రతినిధులు

ఎంవీ సుబ్బారెడ్డి (నేతాజీ), వీరి చలపతి, కులిపోగు ఇర్మియా, రావు శ్రీనివాసరావు (ఆర్ఎస్ఆర్), కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, మేకల శ్రీనివాసులు, ముప్పవరపు కిశోర్, కొడవలూరు భక్తవత్సలరెడ్డి, ఎస్‌కే కరిముల్లా, నెల్లూరు శివప్రసాద్, మధసు యజ్ఞపవన్‌ను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

బిల్లుల్లో గిల్లుడు

ఐసీడీఎస్ కథే వేరయా..!

ఐసీడీఎస్ శాఖాధికారుల అవినీతికి అడ్డూ అదుపు లేకుండా పోయింది. పేద కుటుంబాల్లోని చిన్నారుల నుంచి గర్భిణులు, బాలింతల సంరక్షణ, సమగ్ర వికాసానికి దోహదపడాల్సిన ఆ శాఖలోని అధికారులు కంచే చేను మేసిన చందంగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రతి అంశంలో కమీషన్లు దండుకోవడంతో కింది స్థాయిలో పనిచేసే అంగన్‌వాడీ వర్కర్లు అడ్డదారులు తొక్కాల్సిన తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. సీడీపీఓ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇలా ఎవరి స్థాయిలో వారు అవినీతికి పాల్పడుతున్నారు. కందుకూరు అర్బన్ ప్రాజెక్టులో జరుగుతున్న అవినీతి అక్రమాల తీరును పరిశీలిస్తే విస్మయం తలెత్తక మానదు.

- ప్రతి అంశంలో పది శాతం కమీషన్ ఫిక్స్
- పిల్లల్లేని కేంద్రాలకు రూ.వెయ్యిస్తే అంతా ఓకే
- అద్దె భవనాల యాజమానులకు కుచ్చుటోపీ
- ఈ సొమ్మంతా అధికారిణి బ్యాగులోకి



సింహాద్రినగర్ కాలనీలో అద్దె భవనంలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

కందుకూరు రూరల్: కందుకూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అవినీతికి అడ్డాగా మారింది. ప్రతి అంశంలో కమీషన్లు బొక్కేస్తూ భారీగా వెనుకేసుకుంటున్నారు. వాస్తవానికి కందుకూరు ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోని కందుకూరు అర్బన్‌లో 60, కందుకూరు మండలంలో 51, వలేటివారిపాలెంలో 53 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మధ్యాహ్న భోజనం పెట్టేందుకు కూరగాయలు, తాళింపు గింజలు, గ్యాస్‌కు ప్రత్యేకంగా బిల్లును ప్రభుత్వం ఇస్తుంది. ముందుగా వర్కర్లు డబ్బులు ఖర్చు పెటి ప్రతి నెలా బిల్లులు పెట్టుకుంటారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ప్రతి కేంద్రంలో ప్రతి నెలా రెండు ఈవెంట్స్‌ను నిర్వహించాలి. ఒక్కో దానికి రూ.250 బిల్లొస్తుంది. వీటిలో పది శాతం కమీషన్‌ను సంబంధి ప్రాజెక్ట్ అధికారికి ముట్టజెప్పాలి. మరోవైపు కొన్ని కేంద్రాల్లో పిల్లల పేర్లు నమోదైనా, వారు రారు. ఇలాంటి కేంద్రాల కార్యకర్తలు నెలకు రూ.వెయ్యి, అరకొరగా హాజరవుతుంటే రూ.500 ప్రతి నెలా చెల్లించాలి. ఇలా సమర్పిస్తే పిల్లలు వచ్చినా.. రాకపోయినా ఫుల్ హాజరు వేసుకుని బిల్లు పెట్టుకోవచ్చు.

కమీషన్ వచ్చేది ఇలా..

అక్టోబర్‌లో ఇచ్చిన కూరగాయల, తాళింపులు, గ్యాస్ బిల్లు రూ.57,080 కాగా, 10 శాతం లెక్కన రూ.5,708, ఈవెంట్స్ బిల్లు రూ.82 వేలు కాగా రూ.8,200, అద్దెల బిల్లు రూ.2.5 లక్షలు కాగా, రూ.25 వేలు, ఇలా ఒక్కో నెల సంబంధిత ప్రాజెక్ట్ అధికారిణికి కమీషన్ రూపంలో అక్షరాల రూ.38,908 ఇవ్వాల్సిందే. ఇక పిల్లల్లేని సెంటర్లు, ఇతర ఖర్చుల వసూళ్లు చూస్తే నెలకు దాదాపు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ముట్టజెప్తున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా కార్యకర్తలు, ఆయాల నుంచి వసూలు చేసినట్లు సమాచారం కందుకూరు అర్బన్, వలేటివారిపాళెం సెంటర్ల నుంచి రూ.500, ఒక్క కందుకూరు మండలంలోని వారి నుంచి రూ.1,500 వంతున మొత్తం రూ.1.33 లక్షలు వసూలు చేశారని కార్యకర్తలు వాపోతున్నారు. ప్రత్యేకంగా సెక్టార్ మీటింగ్‌లు పెట్టి మరీ వసూళ్ల పర్వానికి తెరలేపారు.

కుచ్చుటోపీ

ప్రాజెక్ట్ పరిధిలోని 164 అంగన్‌వాడీ కేంద్రాలకు 75 కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. వీటికి కొలత ప్రకారం అద్దెను ప్రభుత్వం చెల్లిస్తోంది. ఇంజినీర్ల స్టేట్‌మెంట్‌నూ తీసుకోవాల్సి ఉంటుంది. అయితే అంగన్‌వాడీ కార్యకర్తలు మాత్రం కొలతల మేరకు కాకుండా యజమానితో ప్రత్యేకంగా అద్దె మాట్లాడుకుంటారు. కొలతల ప్రకారం ఐసీడీఎస్ కార్యాలయంలో నకిలీ అగ్రిమెంట్లను అందజేశారు. అద్దెను జమ చేసేందుకు భవన యజమాని బ్యాంక్ ఖాతా నంబర్‌ను ఇవ్వాల్సి ఉంది. అయితే అలా కాకుండా కార్యకర్తలకు అనుకూలమైన వారి ఖాతా నంబర్‌ను ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేస్తారు. ఆ ఖాతాలోనే బిల్లులు జమవుతున్నాయి. దాదాపు అద్దె భవనాల యజమానుల పేర్లన్నీ మహిళలవే ఉంటున్నాయి. దీని బట్టి అంగన్‌వాడీ వర్కర్లు తమకు అనుకూలమైన మహిళల ఖాతాలనే ఇస్తున్నారని తెలుస్తోంది. సుమారు రూ.ఐదు వేల అద్దె ఐసీడీఎస్ నుంచి వస్తే యజమానికి వారు మాట్లాడుకున్న మేరకు రూ.మూడు వేల నుంచి రూ.3,500 ఇచ్చి మిగిలిన సొమ్మును కార్యకర్తలు, సూపర్‌వైజర్లు పంచుకుంటున్నారు.

ఇదో ఉదాహరణ..

కందుకూరు అర్బన్‌లోని వడ్డెపాళెం అంగన్‌వాడీ కేంద్ర అద్దెకు కమ్మపాళెం అంగన్‌వాడీ కార్యకర్త భర్త పేరు.. కమ్మపాళెం కేంద్రానికి టీచర్ కొడుకు పేరు.. కృష్ణానగర్ కాలనీలోని కేంద్రానికి టీచర్ కుమారుడు పేర్లను ఇచ్చారు. సింహాద్రినగర్ కాలనీ కేంద్రానికి ప్రభుత్వం రూ.4,700 చెల్లిస్తుండగా, అ భవనానికి అద్దె రూ.మూడు వేలే ఉంది. కోటకట్టవీధిలోని 13వ నంబర్ కేంద్రానికి రూ.4,500 ఇస్తున్నా.. అక్కడ అద్దె రూ.3,500 మాత్రమే ఉంది. ఇలా ప్రతి అద్దె భవనాల్లోని కేంద్రాల్లో నకిలీ అగ్రిమెంట్లు సృష్టించి మిగిలించుకుని పంచుకుంటున్నారు.

అసిస్టెంట్ సీడీపీఓగా చెలామణి

ఐసీడీస్ అధికారిణి కుడి భుజంగా ప్రాజెక్ట్‌లోని ఓ కార్యకర్తను ఏర్పాటు చేసుకున్నారు. బిల్లులు వచ్చాయంటే వెంటనే సదరు కార్యకర్త ఎంత కమీషన్ రావాలనే విషయమై సెంటర్ల వారీగా పేపర్‌పై రాసి వాట్సాప్ గ్రూపుల్లో పెడుతున్నారు. మేడం చెప్పారు.. కమీషన్ డబ్బులు తెచ్చివ్వండి.. లేదా ఫోన్ పే కొట్టండంటూ వాయిస్ మేసేజ్‌లు పెడుతున్నారు. ఇలా వసూలైన మొత్తాన్ని సెక్టార్ మీటింగ్‌లో సీడీపీఓకు అప్పగిస్తారు. ఇలా సెక్టార్‌కో కార్యకర్తను ఏర్పాటు చేసుకొని వసూలు చేయిస్తున్నారు. అక్టోబర్, నవంబర్‌కు సంబంధించిన బిల్లుల కమీషన్‌ను గత నెల్లో నిర్వహించిన సెక్టార్ మీటింగ్‌కు వచ్చి సీడీపీఓ తీసుకెళ్లారు. ఈ కమీషన్‌ను ట్రెజరీ అధికారులకు ఇవ్వాలంటూ అబద్ధాలు చెబుతున్నారు.

కార్యాలయం వైపు కన్నెత్తి చూడరు

కందుకూరు సీడీపీఓగా ఉంటూ నెల్లూరులోని సర్వీస్ హోమ్ (ఎఫ్ఏసీ)పై పనిచేస్తున్నారు. వారంలో మూడు రోజులు ఇక్కడ, మూడు రోజులు అక్కడ విధులు నిర్వర్తించాల్సి ఉంది. అయితే సీడీపీఓ మాత్రం నెల్లూరులోనే ఉంటూ కార్యాలయానికి రావడం లేదు. ఏమైనా ఫైళ్లపై సంతకాలు కావాలంటే కార్యాలయ సిబ్బందినే నెల్లూరు పిలిపించుకుంటున్నారు. ఏదో రోజు వచ్చి రిజిస్టర్‌లో సంతకాలు చేసి వెళ్తారు. ఆమె పనితీరుపై పలు విమర్శలొస్తున్నాయి. కాగా ఈ అంశమై ఐసీడీఎస్ పీడీ సుశీలాదేవిని సంప్రదించగా, అవినీతికి పాల్పడితే చర్యలు చేపడతామని చెప్పారు. పీడీగా నూతనంగా వచ్చానని, త్వరలో ప్రాజెక్టులను పరిశీలిస్తామని బదులిచ్చారు.

ప్రాజెక్ట్‌లు భళా..









వివిధ దేశాల కరెన్సీలు



వినూత్న ఆలోచనలు.. కొత్త ఆవిష్కరణలు

నెల్లూరులో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్

- 114 నమూనాల ప్రదర్శన
- దేశాభివృద్ధిలో సైన్స్‌ది కీలకపాత్ర
- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ
- రాష్ట్ర స్థాయికి ఆరు ఎగ్జిబిట్ల ఎంపిక

నెల్లూరు(టౌన్): 'సోలార్ ఫ్లోర్ క్లీనర్, రెయిన్ అలారం, డర్టీ వాటర్ ప్యూరిఫికేషన్, ఆటోమేటిక్ ఫైర్ అలారం, మినీ పవర్ ప్లాంట్స్, సేవ్ నేచర్ ఇలా వినూత్న ఎగ్జిబిట్స్‌ను విద్యార్థులు ప్రదర్శించారు. ఎన్నో సమస్యలకు కొత్త ఆలోచనలతో పరిష్కారాలు చూపారు. నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని ఆరెస్సార్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ ఘనంగా జరిగింది. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ విచ్చేశారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇంకా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా అరుణమ్మ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో సైన్స్‌ది కీలకపాత్ర అన్నారు. చిన్నతనం నుంచే సైన్స్‌పై అభిరుచి పెంచుకోవాలన్నారు. విద్యార్థుల ఆలోచనలకు ఉపాధ్యాయులు పదును పెట్టి భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలన్నారు. డీఈఓ బాలాజీరావు మాట్లాడారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సైన్స్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య, ఏఎంఓ సుధీర్‌బాబు, కందుకూరు డిప్యూటీ డీఈఓ జానకిరామ్, కార్పొరేటర్ కామాక్షిదేవి, ఎంఈఓలు తిరుపాల్, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.



సైన్స్ ప్రాజెక్ట్‌లను పరిశీలిస్తున్న వివిధ పాఠశాలల విద్యార్థులు

మూడు కేటగిరీల్లో..

జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు ప్రదర్శించిన పలు ఎగ్జిబిట్లు ఆకట్టుకున్నాయి. వ్యక్తిగత, గ్రూపు, ఉపాధ్యాయ కేటగిరీలో 114 ఎగ్జిబిట్లను ప్రదర్శించారు.

జీవుల్లో శ్వాస ప్రక్రియపై..

విద్యార్థుల పేర్లు : రేష్మా, సన్నీ హీరా, వైష్ణవి, 10వ తరగతి, జెడ్పీహెచ్‌ఎస్, వీరంపల్లి, మనుబోలు మండలం



చిన్న జీవుల నుంచి పెద్ద జీవుల వరకు శ్వాస ప్రక్రియ ఏ విధంగా జరుగుతుందో ఈ నమూనా ద్వారా విద్యార్థినులు వివరించారు. ఉదాహరణకు చిన్న జీవి ఎర్ర స్కిన్ ద్వారా శ్వాస ప్రక్రియ జరుగుతుంటే, చేపలు మొప్పల ద్వారా శ్వాస ప్రక్రియ జరుగుతుందని చూపించారు.

ప్రమాదాల్ని గుర్తించే..

విద్యార్థి పేరు : ఎస్‌కే నాయిబ్ రసూల్, 9వ తరగతి, జెడ్పీహెచ్‌ఎస్, దర్గామిట్ట



జాతీయ రహదారిపై వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతుంటాయి. అబ్జర్వేషన్ ఇన్షియల్ డిపార్ట్‌మెంట్ (ఓఐడీ)ని వాహనంలో అమర్చడం వల్ల ముందుగా ప్రమాదాన్ని గుర్తించి సేఫ్టీ ప్రాంతానికి తీసుకెళ్లేలా ఈ పరికరం ఉపయోగపడుతుంది. అదే విధంగా ఇంట్లో ఉన్న వారికి కూడా లొకేషన్‌ను షేర్ చేస్తుంది. నావిగేషన్‌తో అనుసంధానం చేస్తారు. దీనికి కావాల్సిన పరికరాలు ఆర్డినోయినో, మోడల్ ప్లేట్స్, అల్ట్రా ఫోనిక్సన్, జీపీఎస్ మాడ్యూల్, బ్లూటూత్ మాడ్యూల్, పవర్ బ్యాటరీ.

డ్రిప్ ఇరిగేషన్

టీచర్ పేరు : శ్రీధర్‌బాబు, జెడ్పీహెచ్‌ఎస్, పాలకూరు, కందుకూరు మండలం



తక్కువ నీటితో ఎక్కువగా పంటలను ఏ విధంగా పండించవచ్చో ఈ ఎగ్జిబిట్ ద్వారా వివరించారు. బోరు బావి వద్ద ట్యాంక్‌ను ఏర్పాటు చేసుకుని సోలార్ వ్యవస్థ ద్వారా మోటార్‌ను బిగించి పైపు లైన్ నుంచి నేరుగా మొక్కకు నీరు అందించవచ్చని వివరించారు. దీని వల్ల నీరు వృథా కాదు.

క్లినో మీటర్

విద్యార్థులు : కీర్తి, రాజశ్రీ, పదో తరగతి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కోడూరు



ఎత్తైన భవనాలు, పొడవైన నదులు తదితర వాటిని కొలవడం కష్టంగా ఉంటుంది. క్లినో మీటర్ ద్వారా దూరంగా ఉండే వాటి ఎత్తు, పొడవు, వెడల్పును సులభంగా కొలత తీయొచ్చు. కావాల్సిన పరికరాలు స్టాండ్, వృత్తాకార కోణమాని, దయల్ ఇండికేటర్.



సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న అరుణమ్మ

వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్

విద్యార్థుల పేర్లు : ఐశ్వర్య, నవ్యశ్రీ, 9వ తరగతి, జెడ్పీహెచ్‌ఎస్, సోమశిల



పరిశ్రమల నుంచి కలుషిత నీరు బయటకు వస్తుంది. ఈ నీటి వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతుంటారు. అదే పరిశ్రమ యాజమాన్యం వేస్ట్ వాటర్‌ను శుద్ధి చేస్తే మళ్లీ వినియోగించుకునే వీలుంటుంది. కలుషిత నీటిని తొలుత స్టోన్స్‌లోకి పంపాలి. ఆ తర్వాత బొగ్గు, ఇసుక, కాటన్ ద్వారా నీరు శుద్ధి అవుతుంది.

రాష్ట్ర స్థాయికి ఎంపిక

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు వ్యక్తిగత నుంచి రెండు, గ్రూపు నుంచి రెండు, ఉపాధ్యాయ కేటగిరీ నుంచి రెండు ఎగ్జిబిట్లను ఎంపిక చేశారు. సైన్స్ ఫెయిర్‌లో న్యాయనిర్ణేతలుగా విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.సాయినాథ్, డా.గోపీకృష్ణ, డా.శివశంకర్‌రెడ్డి, డా.త్రివాణి, డా.హుస్సేనయ్య, డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల అధ్యాపకులు కవితలు వ్యవహరించారు. ప్రతిభ చూపిన వారికి డీఈఓ ఆర్.బాలాజీరావు చేతుల మీదుగా జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

➡ వ్యక్తిగత కేటగిరీకి సంబంధించి ఇందుకూరుపేట మండలం కొమరిక జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి షణ్ముఖ్ తయారు చేసిన గ్లాసెస్ ఫర్ బ్లైండ్ పీపుల్, రాపూరు మండలం కండలేరు ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్‌కు చెందిన చైత్రకృష్ణ తయారు చేసిన ప్రొక్షన్ డిస్క్ నమూనాలు ఎంపికయ్యాయి.



వ్యక్తిగత కేటగిరీలో ప్రతిభ చూపి డీఈఓ చేతుల మీదుగా జ్ఞాపికలు అందుకుంటున్న విద్యార్థులు



➡ గ్రూపు కేటగిరీకి సంబంధించి వెంకటాచలం మండలం గొలగమూడి ప్రభుత్వ ఎస్టీ ఆశ్రమ హైస్కూల్‌కు చెందిన కరిష్మా, దీక్షలు తయారు చేసిన హిల్‌స్టేషన్ యూటర్న్ యాక్సిడెంట్ ప్రివెన్షన్, టీపీ గూడూరు మండలం కొండూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం పాఠశాల విద్యార్థులు కీర్తిశ్రీ, రాజశ్రీలు తయారు చేసిన అప్లికేషన్స్ ఆఫ్ ట్రిగోనోమెట్రీ ఇన్ రియల్ లైఫ్ ప్రాజెక్ట్‌లు ఎంపికయ్యాయి.

➡ ఉపాధ్యాయ కేటగిరీలో వెంకటాచలం మండలం గొలగమూడిలోని ప్రభుత్వ ఎస్టీ ఆశ్రమ హైస్కూల్ ఉపాధ్యాయులు అమరావతి తయారు చేసిన రెయిన్ డ్రాప్ సెన్సార్ ప్రాజెక్ట్, ఉలవపాడు మండలం వీరపల్లిలోని ఏపీఎంఎస్ పాఠశాల ఉపాధ్యాయులు బిందుమాధవి తయారు చేసిన సీ ఛేంజ్‌కు సంబంధించిన ఎగ్జిబిట్లున్నాయి.




గ్రూపు విభాగంలో..




ఉపాధ్యాయ కేటగిరీలో..



సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అరుణమ్మ, అధికారులు



సైన్స్ ఫెయిర్ వద్ద విద్యార్థుల సందడి

నెల్లూరుకు చేరుకున్న కమిషన్ చైర్మన్



చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ

నెల్లూరు రూరల్: షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణ అభిప్రాయసేకరణలో భాగంగా వన్‌మ్యాన్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా శుక్రవారం రాత్రి నెల్లూరు ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకున్నారు. ఆయనకు ఎస్పీ కృష్ణకాంత్, సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి, నెల్లూరు ఆర్డీఓ అనూష, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి పుష్పగుచ్ఛాలిచ్చి ఘన స్వాగతం పలికారు.

అనుమానాస్పద స్థితిలో..

- బాలుడి మృతి

కావలి: పట్టణంలోని బాలకృష్ణారెడ్డినగర్‌కు చెందిన చిన్నారి పానుమల్లి చక్రధర్ (8) అనే బాలుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన శుక్రవారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. చక్రధర్ స్థానికంగా ఉండే పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. తండ్రి వంట మాస్టర్, తల్లి గృహిణి. పాఠశాలకు వెళ్లిన బాలుడు సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు కంగారుపడి గాలింపు చర్యలు చేపట్టారు. పాఠశాల నుంచి ఇంటికి వచ్చే ప్రాంతంలోని నీటి గుంతలో పడి మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



చక్రధర్ మృతదేహం



చక్రధర్ (ఫైల్)

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు



లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థిని

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు పోలీసు కవాతు మైదానంలో పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు గతనెల 30వ తేదీ నుంచి ఎస్పీ జి.కృష్ణకాంత్ పర్యవేక్షణలో జరుగుతున్నాయి. చలితీవ్రత అధికంగా ఉన్నా అభ్యర్థులు తెల్లవారుజామున నాలుగు గంటలకే మైదానానికి చేరుకుంటున్నారు. 9వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. శుక్రవారం మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. 417 మందికి గానూ 226 మంది హాజరుకాగా 191 మంది గైర్హాజరయ్యారు. ఎస్పీ కృష్ణకాంత్, ఏఎస్పీ సీహెచ్ సౌజన్యలు పర్యవేక్షించారు. శనివారం కూడా పరీక్షలు కొనసాగుతాయి. మొత్తంగా నాలుగు రోజుల్లో 2,217 మందికి గానూ 1,127 మంది పరీక్షలకు హాజరుకాగా 1,090 మంది వివిధ కారణాలతో గైర్హాజరయ్యారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

బిట్రగుంట: బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ కడనూతల, బోగోలు, కప్పరాళ్లతిప్ప, చెంచులక్ష్మీపురం, నాగులవరం, సోమేశ్వరపురం తదితర ప్రాంతాల్లోని నాటుసారా తయారీ స్థావరాలపై కావలి ఎక్సైజ్ శాఖ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. సంక్రాంతి పండగ, వ్యవసాయ పనుల నేపథ్యంలో సారా తయారీ, విక్రయాలను అడ్డుకునేందుకు బృందాలుగా విడిపోయిన సిబ్బంది దాడులు చేపట్టారు. కప్పరాళ్లతిప్ప సమీపంలోని నక్కలగుంట వద్ద సుమారు వంద లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. మిగిలిన ప్రాంతాల్లోనూ విస్తృతంగా తనిఖీలు నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. దాడుల్లో కావలి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, నెల్లూరు, కలిగిరి ఎక్సైజ్ సిబ్బంది, ఈఎస్‌టీఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు

నిమ్మ ధరలు (కిలో)
పెద్దవి : రూ.28
సన్నవి : రూ.23
పండ్లు : రూ.12

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు
బ్రాయిలర్ (లైవ్) : 113
లేయర్ (లైవ్) : 85
బ్రాయిలర్ చికెన్ : 206
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 226
లేయర్ చికెన్ : 145

నిమ్మ పరిశోధన కేంద్రంలో యూకే పారిశ్రామికవేత్త



కేంద్రం వద్ద పారిశ్రామికవేత్త, శాస్త్రవేత్తలు

సైదాపురం: వెంకటగిరి రూరల్ మండలం పెట్లూరు గ్రామ సమీపంలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, నిమ్మ, చీనీ పరిశోధన కేంద్రాన్ని యూకేకు చెందిన పారిశ్రామికవేత్త హ్యూగో బోవిల్, గూడూరులోని సిఫల్ హెర్బల్ సంస్థ ఎండీ ఎలవర్తి విద్యాసాగర్, ఇండో వరల్డ్ ట్రేడింగ్ కార్పొరేషన్ (న్యూఢిల్లీ) ఉపాధ్యక్షుడు అనిల్ శుక్రవారం సందర్శించారు. వారంతా నిమ్మ, చీనీ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ పి.శ్యామ్‌సుందర్‌రెడ్డి, శాస్త్రవేత్త డాక్టర్ ఖాందార్ నాయక్‌లతో మాట్లాడారు. శ్యామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ నిమ్మ పంటలో వచ్చే తెగుళ్లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, మార్కెటింగ్ సౌకర్యాలను తెలుసుకున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

నెల్లూరు(క్రైమ్): రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వృద్ధురాలి మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు.. కోవూరు మండలం పడుగుపాడు స్టాబీడీ కాలనీకి చెందిన లక్ష్మణ్‌సింగ్, చిడిబాయి (64)లు దంపతులు మందుల కోసం గతనెల 31వ తేదీన మోటార్‌బైక్‌పై నెల్లూరుకు వచ్చారు. తిరిగి కొత్త పెన్నా బ్యారేజ్ మీదుగా కోవూరుకు బయలుదేరారు. బ్యారేజ్ స్పీడ్ బ్రేకర్స్ వద్ద బైక్ అదుపు తప్పింది. వెనుక కూర్చొని ఉన్న చిడిబాయి రోడ్డుపై పడగా తలకు తీవ్రగాయమైంది. ఈ విషయాన్ని లక్ష్మణ్‌సింగ్ తన కుమారుడు విజయసింగ్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. అతను వెంటనే ఘటనా స్థానికి చేరుకుని చిడిబాయిని చికిత్స నిమిత్తం తొలుత నగరంలోని రామచంద్రారెడ్డి హాస్పిటల్‌కు, అక్కడి నుంచి నారాయణ హాస్పిటల్‌కు, తర్వాత జీజీహెచ్‌కు తరలించారు. ఆమె చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతిచెందింది. శుక్రవారం విజయ్‌సింగ్ నార్త్ ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.